అశ్విన్ ఇక ఫ్రాంచైజీ ఓనర్

- గ్లోబల్ చెస్ లీగ్‌లో స్టార్ స్పిన్నర్ పెట్టుబడులు

ఢిల్లీ: భారత క్రికెట్ జట్టు స్టార్ స్పిన్నర్ రవి చంద్రన్ అశ్విన్ ఫ్రాంచైజీ కో ఓనర్ అయ్యాడు. గ్లోబల్ చెస్ లీగ్‌లో అతడు 'అమెరికన్ గాంబిట్స్' ఫ్రాంచైజీలో సహ యజమానిగా పెట్టుబడులు పెట్టాడు. టెక్ మహీంద్ర, అంతర్జాతీయ చెస్ సమాఖ్య సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ లీగ్ రెండో ఎడిషన్ రానున్న అక్టోబర్‌లో మొదలుకానుండగా తాజాగా ఇందుకు సంబంధించిన ఓ జట్టు రిప్లేస్‌మెంట్‌ను నిర్వాహకులు ప్రకటించారు. 'చింగారి గల్ఫ్ టైటాన్స్' స్థానంలో అమెరికన్ గాంబిట్స్ బరిలో దిగనుంది. అక్టోబర్ 3 నుంచి 12 దాకా లండన్ వేదికగా జరుగబోయే ఈ టోర్నీ రెండో ఎడిషన్‌లో అల్పైన్ ఎస్‌సీ పైపర్స్, పీబీజీ అలస్కన్ నైట్స్, గ్యాంగ్స్ గ్రాండ్‌మాస్టర్స్, త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ ఇతర జట్లుగా ఉన్నాయి. ప్రముఖ వ్యాపారవేత్తలు పీపీ ప్రచుర, వెంకట్ కె నారాయణతో కలిసి అశ్విన్.. అమెరికన్ గాంబిట్స్‌లో పెట్టుబడులు పెట్టాడు.

లంక హెడ్‌కోచ్‌గా జయసూర్య

కొలంబో: త్వరలో భారత్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లకు ఆతిథ్యమిస్తున్న శ్రీలంక.. ఈ సిరీస్‌లో తమ జాతీయ జట్టుకు తాత్కాలిక హెడ్‌కోచ్‌గా దిగ్గజ ఆటగాడు సనత్ జయసూర్యను నియమించింది. ఇటీవలే ముగిసిన పొట్టి ప్రపంచకప్‌లో లంక గ్రూప్ దశకే పరిమితమవడంతో ఆ జట్టుకు హెడ్ కోచ్‌గా ఉన్న క్రిస్ సిల్వర్‌వుడ్ తన బాధ్యతల నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జట్టుకు పూర్తిస్థాయి కోచ్‌ను నియమించేదాకా జయసూర్య ఆ బాధ్యతలు మోస్తాడని శ్రీలంక క్రికెట్(ఎస్ఎల్‌సీ) ఓ ప్రకటనలో తెలిపింది. జూలై 27 నుంచి శ్రీలంక.. భారత్‌తో మూడు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది.

ఒక్కో ఆటగానికి రూ.5 కోట్లు

హెడ్‌కోచ్‌కూ భారీ నజరానా

పంపకాలు సిద్ధం చేసిన బీసీసీఐ!

ఢిల్లీ: ఇటీవలే టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు ప్రకటించిన రూ.125 కోట్ల నగదు బహుమానానికి సంబంధించిన పంపకాల ప్రక్రియను బీసీసీఐ సిద్ధం చేసింది. ఆటగాళ్లు, కోచింగ్, సహాయక సిబ్బంది, రిజర్వ్ ఆటగాళ్లతో కలుపుకుని అమెరికా, వెస్టిండీస్‌కు వెళ్లిన 42 మందికీ వీటిని పంచనుంది. రూ.125 కోట్లను వరల్డ్ కప్ జట్టులో సభ్యులుగా ఉన్న 15 మంది ఆటగాళ్లకు తలా ఒక్కరికి రూ.5 కోట్లు అందించనుంది. టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఆడని చాహల్, జైస్వాల్‌కు కూడా ఇంతే క్యాష్‌ప్రైజ్ దక్కనుంది. హెడ్‌కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో పాటు బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్, ఫీల్డింగ్ కోచ్ దిలీప్, బౌలింగ్ కోచ్ పరాస్ మంబ్రేకు ఒక్కొక్కరికి రూ. 2.55 కోట్లు దక్కనున్నాయి. అజిత్ అగార్కర్ సారథ్యంలో సెలక్షన్ కమిటీలో ఉన్న సభ్యులు తలా కోటి రూపాయలు అందుకోనున్నారు. ఫిజియోథెరపిస్టులు కమలేష్ జైన్, యోగేశ్ పర్మర్, తులసి రామ్, త్రోడౌన్ స్పెషలిస్టులు అయిన రాఘవేంద్ర, నువాన్, దయానంద్, మసాజర్లు రాజీవ్ కుమార్, అరుణ్ కనాడె, స్ట్రెంథ్ అండ్ కండీషనింగ్ కోచ్ సోహమ్ దేశాయ్‌కు తలా రూ. 2 కోట్లు అందనుంది. రిజర్వ్ ఆటగాళ్లుగా ఉన్న గిల్, రింకూసింగ్, ఖలీల్‌కూ కోటి రూపాయలు ముట్టనున్నవి. వీళ్లే గాక

జట్టుతో పాటే ఉన్న వీడియో అనలిస్టు, బీసీసీఐ సహాయక సిబ్బంది, లాజిస్టిక్స్ మేనేజర్‌కూ నగదు బహుమానం అందనున్నట్టు బోర్డు వర్గాల సమాచారం.

భారత 'చెఫ్ డి మిషన్'గా గగన్ నారంగ్

పతాకధారులుగా సింధు, శరత్ కమల్

ఢిల్లీ: త్వరలో జరుగబోయే పారిస్ ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారుల బృందానికి చెఫ్ డి మిషన్‌గా మాజీ షూటర్, లండన్ ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన హైదరాబాదీ గగన్ నారంగ్ ఎంపికయ్యాడు. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) అధ్యక్షురాలు పీటీ ఉష సోమవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపారు. గతంలో ఈ బాధ్యతలను దిగ్గజ బాక్సర్ మేరీకోమ్‌కు అప్పగించినా వ్యక్తిగత కారణాలతో ఆమె వాటి నుంచి వైదొలగడంతో ఐవోఏ గగన్ నారంగ్‌ను నియమించింది. ఇక విశ్వక్రీడల ఆరంభ కార్యక్రమంలో భారత పతాకధారులుగా స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ అయిన తెలుగమ్మాయి పీవీ సింధు, టేబుల్ టెన్నిస్ దిగ్గజం ఆచంట శరత్‌కమల్ ఉండనున్నారు. ఈసారి ఒలింపిక్స్‌కు భారత్ సుమారు వంద మందికి పైగా క్రీడాకారులను బరిలో నిలిపింది.

గాఫ్ ఔట్

వింబుల్డన్‌లో కొనసాగుతున్న సంచలనాలు ● రిబాకినా, ముసెట్టి ముందంజ

లండన్: వింబుల్డన్‌లో సంచలనాల పర్వం కొనసాగుతోంది. ముఖ్యంగా మహిళల సింగిల్స్‌లో టైటిల్ ఫేవరేట్లుగా భావిస్తున్న స్టార్ ప్లేయర్లంతా ఒక్కొక్కరుగా ఇంటిబాట పడుతున్నారు. ఇదివరకే నవామి ఒసాకా, డిఫెండింగ్ చాంపియన్ వొండ్రుసోవా, వరల్డ్ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ ఇంటిబాట పట్టగా తాజాగా కోకో గాఫ్ (అమెరికా), ఎమ్మా రడుకాను (బ్రిటన్) సైతం క్వార్టర్స్‌కు చేరకుండానే నిష్క్రమించారు. ఆదివారం ముగిసిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో రడుకాను 2-6, 7-5, 2-6తో లులు సన్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓటమిపాలైంది. రెండో సీడ్ కోకో గాఫ్ 4-6, 3-6తో అమెరికాకే చెందిన ఎమ్మా నవర్రొ చేతిలో చిత్తైంది. నాలుగో సీడ్ రిబాకినా 6-3, 6-0తో అన్నా కలిన్స్కయను ఓడించింది. మెయిన్ డ్రాలో టాప్‌సీడ్ ర్యాంకు కలిగిన అమ్మాయిల్లో రిబాకినా ఒక్కతే బరిలో నిలవడం గమనార్హం. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ఇటలీ ప్లేయర్ లొరెంజో ముసెట్టి 4-6, 6-3, 6-3, 6-2తో పెర్రికర్డ్ (ఫ్రాన్స్)ను ఓడించి క్వార్టర్స్ చేరుకున్నాడు. తద్వారా ఈ టోర్నీలో పలోని, సిన్నర్ తర్వాత క్వార్టర్స్ చేరిన మూడో ఇటాలియన్‌గా నిలిచాడు. తొమ్మిదో సీడ్ అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా) 6-2, 6-4, 4-6, 6-3తో ఆర్థర్ ఫిల్స్ (ఫ్రాన్స్)ను ఓడించాడు.

జ్వెరెవ్ నిష్క్రమణ

వింబుల్డన్ టోర్నీలో జర్మనీ ప్లేయర్ అలెగ్జాండర్ జ్వెరెవ్ పోరాటం ముగిసింది. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ నాలుగో రౌండ్ పోరులో జ్వెరెవ్ 6-4, 7-6(7-4), 4-6, 6-7(3-7), 3-6తో ఫ్రిట్జ్ చేతిలో అనూహ్య ఓటమి ఎదుర్కొన్నాడు.

టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో పేస్

లండన్: ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో భారత దిగ్గజం లియాండర్‌పేస్ చోటు దక్కించుకున్నాడు. తన సుదీర్ఘ కెరీర్‌లో 18సార్లు గ్రాండ్‌స్లామ్ చాంపియన్‌గా నిలిచిన పేస్..ట్రోఫీలను ప్రదర్శనకు ఉంచబోతున్నాడు. తాజ్ హోటల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేస్ మీడియా ముఖంగా ప్రకటించాడు. 'నా కెరీర్‌లో గెలిచిన గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు ఆస్ట్రేలియా, ఫ్రెంచ్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్ టైటిళ్లతో పాటు నాలుగు రన్నరప్ ట్రోఫీలను ప్రదర్శనకు ఉంచబోతున్నాను. దీంతో పాటు ఒలింపిక్(1996) పతకాన్ని హాల్ ఆఫ్ ఫేమ్‌లో చేర్చాను. వింబుల్డన్ టెన్నిస్ రాకెట్, ఫ్రెంచ్ ఓపెన్(2016) టవల్, డేవిస్‌కప్ బ్లేజర్, ఒలింపిక్ ట్రాక్‌సూట్ ప్రదర్శనలో ఉంటాయి' అని అన్నాడు. ప్రపంచ వ్యాప్తంగా 274 మంది ప్లేయర్లతో కూడిన జాబితాలో పేస్‌కు చోటు దక్కిందని హాల్ ఆఫ్ ఫేమ్ సీఈవో డాన్ ఫేబర్ పేర్కొన్నాడు.

మా దేశంలో సంబురాలు చేసుకోండి

భారత జట్టుకు మాల్దీవులు ఆహ్వానం

మాలె: ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ గెలిచి ప్రపంచ చాంపియన్లుగా నిలిచిన భారత జట్టుకు మాల్దీవులు ప్రత్యేక ఆహ్వానం పంపింది. ప్రపంచకప్ గెలిచిన సందర్భంగా తమ దేశంలో సంబురాలు చేసుకోవాలని దానిని తాము ఒక గౌరవంగా భావిస్తామని మాల్దీవ్స్ మార్కెటింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ కార్పొరేషన్ (ఎంఎంపీఆర్‌సీ) సోమవారం విడుదల చేసిన బహిరంగ ప్రకటనలో తెలిపింది. 'మేము వారికి ఆతిథ్యమిచ్చేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. భారత జట్టును స్వాగతించడం, వారి విజయోత్సవ వేడుకల్లో పాలుపంచుకోవడం మాకు గొప్ప గౌరవం' అని ప్రకటనలో పేర్కొంది.

గెలవకుండానే నజరానా

భువనేశ్వర్: ఏదైనా అంతర్జాతీయ ఈవెంట్స్‌లో పోటీపడి పతకాలు గెలిచొచ్చిన క్రీడాకారులకు ప్రభుత్వం తరపున నగదు బహుమానాలు అందజేయడం సర్వసాధారణం. కానీ ఒడిషా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాత్రం అందుకు భిన్నంగా తమ రాష్ట్రం నుంచి పారిస్ ఒలింపిక్స్ బరిలో నిలిచిన ఇద్దరు ఆటగాళ్లకు రూ. 15 లక్షల క్యాష్ ప్రైజ్ ప్రకటించారు. భారత హాకీ జట్టులో ఉన్న అమిత్ రోహిదాస్, అథ్లెట్ కిషోర్ జెనా ఒడిషాకు చెందినవారే.

అడ్డుకుంటారా? అప్పగిస్తారా?

బౌలర్ల ఫామ్‌పై టీమ్‌ఇండియా ఆందోళన ● ఫుల్ జోష్‌లో సఫారీలు

నేడు భారత్, దక్షిణాఫ్రికా మహిళల ఆఖరి టీ20

చెన్నై: స్వదేశంలో దక్షిణాఫ్రికాతో వన్డేలు, ఏకైక టెస్టులో అదరగొట్టిన భారత మహిళల జట్టు టీ20లలో మాత్రం తేలిపోతోంది. చెన్నై వేదికగా జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో స్వల్ప తేడాతో ఓడిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన రెండో మ్యాచ్ వర్షార్పణం కావడంతో మంగళవారం ఆఖరిదైన మూడో మ్యాచ్‌లో సఫారీలతో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో ఓడితే సిరీస్ గోవిందా! వర్షం వల్ల రద్దు అయినా భారత్‌కు నిరాశే. ప్రధానంగా ఈ సిరీస్‌లో బౌలర్లు ధారాళంగా పరుగులిచ్చుకుంటుండం భారత్‌ను తీవ్రంగా కలవరపెడుతున్నది.

గత రెండు మ్యాచ్‌లలో పూజా వస్త్రకార్, దీప్తిశర్మ మినహా మిగిలిన బౌలర్లంతా విఫలమయ్యారు. ఏస్ పేసర్ రేణుకాసింగ్ ఠాకూర్ తొలి మ్యాచ్‌లో ప్రభావం చూపకపోవడంతో రెండో టీ20లో ఆమె బెంచ్‌కే పరిమితమైంది. గత మ్యాచ్‌లో శ్రేయాంక పాటిల్ ఆకట్టుకోకపోగా రాధా యాదవ్ రెండు మ్యాచ్‌లలోనూ భారీగా పరుగులు సమర్పించుకుంది. బౌలర్ల వైఫల్యంతో తొలి మ్యాచ్‌లో 189 పరుగులు చేసిన దక్షిణాఫ్రికా వర్షం వల్ల రద్దైన రెండో టీ20లోనూ 177 పరుగుల భారీ స్కోరు సాధించగలిగింది.

బ్యాటింగ్‌లో భారత్‌కు స్మృతి మంధాన ఫామ్‌లో ఉండటం కలిసొచ్చేదే కాగా తొలి మ్యాచ్‌లో విఫలమైన షఫాలీ వర్మ భారీ ఇన్నింగ్స్ బాకీపడి ఉంది. హర్మన్‌ప్రీత్, జెమీమా రోడ్రిగ్స్ టచ్‌లోనే ఉన్నారు. హేమలత, యువ వికెట్ కీపర్ ఉమా ఛెత్రి చెలరేగాలని భారత్ భావిస్తోంది. మరోవైపు సఫారీ బ్యాటర్లలో బ్రిట్స్, కెప్టెన్ వోల్వార్ట్, మరిజన్నె కాప్, అన్నెకి బోష్ గత రెండు మ్యాచ్‌లలోనూ మెరుపులు మెరిపించారు. మరి మంగళవారం జరుగబోయే కీలక పోరులో అయినా మన బౌలర్లు సఫారీ బ్యాటర్ల జోరును ఏ మేరకు అడ్డుకుంటారనేది ఆసక్తికరం.